సాక్షి నిర్మల్

మంగళవారం, 4, ఏప్రిల్, 2023



కల్యాణం కమనీయం

జిల్లా కేంద్రంలోని దేవరకోట ఆలయంలో పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం కమనీయంగా జరిగింది. 8లో▸



తల్లిదండ్రులకూ పరీక్షే..!

పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే ఎగ్జామ్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పట్లేదు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.4 /23.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి పెరుగుతుంది. గాలిలో తేమ అధికంగా ఉండి ఉక్కపోతగా అనిపిస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ మంగళ : 6:30 | సహర్ మంగళ : 4:44

న్యూస్‌రీల్

చిరస్మరణీయుడు దొడ్డి కొమురయ్య

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: సాయుధ పోరాట కాలపు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, బీసీ సంక్షేమశాఖ అధికారి లోకేష్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ సూచన
- ప్రజావాణిలో 29 దరఖాస్తుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 29 అర్జీలురాగా వాటిని వారంలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నిశాఖల అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

ప్రత్యేక అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని, కేటాయించిన మండలాలను పర్యవేక్షిస్తూ హాస్టల్స్, అంగన్‌వాడీ స్కూల్స్ ప్రతీరోజు సందర్శించాలన్నారు. పిల్లలతో కలిసి భోజనం చేయాలన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎంబడి చంద్రశేఖర్

నిర్మల్‌టౌన్: బీసీ వసతిగృహాల్లో పనిచేస్తున్న డెయిలీవైజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెయిలీవైజ్ ఉద్యోగులకు పది నెలలుగా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కోకన్వీనర్లు కత్రోజ్ అశోక్ చారి, కొట్టురి కిషన్, గౌరవ సలహాదారు ఖమ్మం నర్సింహులు పాల్గొన్నారు.

'రాయితీలు పేదలకు ఇవ్వాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కట్ల లక్ష్మి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం అందించే రాయితీలు కార్పొరేట్లకు కాకుండా పేదలకు ఇవ్వాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో సోమవారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు, 10 కేజీల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గంగామణి, లక్ష్మి, చిట్టి, లత, కవిత, నరేందర్ పాల్గొన్నారు.

టోల్ మోత !



గంజాల్ టోల్ ప్లాజా

- 5.5 శాతం మేర పెంచిన జాతీయ రహదారుల సంస్థ
- వాహనాన్ని బట్టి రూ.5 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు
- ఈ నెల 1 నుంచి అమలు
- జిల్లాలో రెండు టోల్ ప్లాజాలు

నిర్మల్‌చైన్‌గేట్: జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల్లో చార్జీలు పెరిగాయి. రాష్ట్రంలో ఉన్న 29 ప్లాజాల్లో హైదరాబాద్–బెంగళూరు హైవే మినహా మిగతా టోల్ ప్లాజాల రుసుములను ఎన్‌హెచ్‌ఏఐ సవరించింది. టోల్ ప్లాజాల్లో ఏప్రిల్ 1 శుక్రవారం రాత్రి నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఆయా రోడ్ల నిడివి, వెడల్పు, వాటి మీద ప్రయాణించే వాహనాల సంఖ్య, టోల్ గేట్ల సామర్థ్యం, నిర్వహణ వ్యయం.. ఇలా పలు అంశాల ప్రాతిపదికగా టోల్ ధరలను సవరించారు. కార్లు, జీపులు లాంటి వాహనాలకు 5 నుంచి 8 శాతం, లైట్ కమర్షియల్ వాహనాలకు 10 నుంచి 15 శాతం, బస్సులు, ట్రక్కులకు 10 నుంచి 15 శాతం చార్జీలు పెరిగాయి. ఆయా కేటగిరీల్లో రూ.5 నుంచి రూ.50 వరకు ధరలు పెరిగాయి. టోల్ ధరలను ఏటా ఏప్రిల్ 1న సవరిస్తారు.

జిల్లాలో రెండు టోల్‌ప్లాజాలు

జిల్లాలోని సోన్ మండలంలోని గంజాల్‌లో, దిలావర్‌పూర్ మండల కేంద్రంలో టోల్ ప్లాజాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో 10 కిలోమీటర్ల దూరంలో గంజాల్ టోల్ ప్లాజా, భైంసా వెళ్లే మార్గంలో 13 కిలోమీటర్ల దూరంలో దిలావర్‌పూర్ టోల్ ప్లాజాలు ఉన్నాయి. పెరిగిన టోల్ చార్జీలతో జిల్లా ప్రజలపై అదనపు భారం పడనుంది. నిర్మల్–భైంసా 61వ జాతీయ రహదారిపై దిలావర్‌పూర్ సమీపంలో ఉన్న టోల్ గేట్ నుంచి నిత్యం వందల సంఖ్యలో కార్లు, బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీని ద్వారా నిర్వాహకులు నిత్యం రూ.2.38 లక్షలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తారు. ప్రస్తుతం ఇది రెట్టింపైంది.

టికెట్‌పై రూ.10 అదనం

జిల్లా వాసులు నిర్మల్ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో నాలుగు టోల్ ప్లాజాలు దాటాల్సి వస్తుంది. ఆర్టీసీ చార్జీలు పెరగకముందు రూ.10 టోల్ రుసుం కింద వసూలు చేసేవారు. పెరిగిన చార్జీలతో రూ.20 వసూలు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఆ రూట్లలో చార్జీలు పెరగలే..

కేంద్ర ప్రభుత్వం టోల్ ప్లాజా రేట్లు పెంచినా జిల్లాలో కొన్ని మార్గాలకు ఆర్టీసీ రేట్లు పెంచలేదు. జిల్లా కేంద్రం నుంచి నిజామాబాద్, భైంసా, ఆదిలాబాద్ వెళ్లే బస్సులకు అదనంగా ఎలాంటి చార్జీలు వసూలు చేయడంలేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఫాస్టాగ్‌తో కచ్చితమైన ఆదాయం

గతంలో టోల్‌గేట్ల వద్ద నిర్వాహకులు వాహనాల నుంచి వసూలు చేసిన మొత్తంలో దాదాపు 25 శాతం పక్కదారి పటించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు చేరే మొత్తం తక్కువగా కనిపించేది. ఫాస్టాగ్ అమల్లోకి వచ్చాక అక్రమాలకు తెరపడి ప్రతి రూపాయి లెక్కలోకి వస్తోంది. మూడేళ్లుగా టోల్ వసూళ్లు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 98.6 శాతం వాహనాలు ఫాస్టాగ్‌ను వినియోగిస్తున్నాయి.

గంజాల్ టోల్ ప్లాజాలో..

- కార్లు, జీపులకు సింగిల్ జర్నీ చార్జీ రూ.20 నుంచి రూ.60, రిటర్న్ జర్నీ రూ. 45 నుంచి రూ.90, పాస్ రూ.1,420 నుంచి రూ.1,995, లైట్ కమర్షియల్ వాహనాలకు సింగిల్ ట్రిప్ రూ.35 నుంచి రూ.95, రిటర్న్ జర్నీ రూ.70 నుంచి రూ.145, నెలవారీ పాస్ రూ.2,295 నుంచి రూ.3,220
- బస్సు, ట్రక్కులకు సింగిల్ ట్రిప్ రూ.70 నుంచి రూ.205, రిటర్న్ జర్నీ రూ.145 నుంచి 305, నెలవారీ పాస్ రూ.4,810 నుంచి రూ.6,750
- ఓవర్ సైజ్డ్ వెహికల్స్‌కు సింగిల్ ట్రిప్ రూ.140 నుంచి రూ.385, రిటర్న్ జర్నీ రూ.275 నుంచి రూ.580, నెలవారీ పాస్ రూ.9,785 నుంచి రూ.12,890కు సవరించారు.

దిలావర్‌పూర్ టోల్ ప్లాజాలో...

- కార్లు, జీపులకు సింగిల్ జర్నీ రూ.45 నుంచి రూ.50, రిటర్న్ జర్నీ రూ.70 నుంచి రూ.75, పాస్ రూ.1,555 నుంచి రూ. 1,635, లైట్ కమర్షియల్ వాహనాలకు సింగిల్ ట్రిప్ రూ.75 నుంచి రూ.80, రిటర్న్ జర్నీ రూ.115 నుంచి రూ.120, నెలవారీ పాస్ రూ.2,515 నుంచి రూ.2,640
- బస్సులు, ట్రక్కులకు సింగిల్ ట్రిప్‌కు రూ.160 నుంచి రూ.165, రిటర్న్ జర్నీ రూ.235 నుంచి రూ.250, నెలవారీ పాస్ రూ.5,270 నుంచి రూ.5,535
- ఓవర్ సైజ్డ్ వెహికల్స్ సింగిల్ ట్రిప్‌కు రూ.300 నుంచి రూ.315, రిటర్న్ జర్నీ రూ.455 నుంచి రూ.475, నెలవారీ పాస్ రూ.10,055 నుంచి రూ.10,565కు సవరించారు.

స్థానికులకు మినహాయింపు ఇవ్వాలి



ఉద్యోగరీత్యా నేను తరచూ నిర్మల్ నుంచి నిజామాబాద్‌కు రాకపోకలు సాగిస్తా. ఇందుకు నెలవారీ పాస్ తీసుకున్నా. టోల్‌ప్లాజా వద్ద స్థానికులకు రుసుం వసూలు నుంచి మినహాయింపు ఇవ్వాలి.

– రమేష్ శ్రీ వాస్తవ, వాహనదారుడు, నిర్మల్

ఉపసంహరించుకోవాలి



ఇప్పటికే ఫైనాన్స్ కంపెనీలకు వాహనాల ఈఎంఐలు కూడా కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వాటికి తోడు టోల్ చార్జీలతో ఇబ్బంది పడుతున్నాం. మరోసారి రుసుం పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– నిగులపు సంజీవ్ కుమార్, నిర్మల్

టోల్ రుసుం పెరుగుతుంది



టోల్ ప్లాజాలు కలిగిన జాతీయ రహదారులపై రాకపోకలు సాగించే వాహనాలకు పెరిగిన టోల్ రుసుము ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. జీడీపీ రేటును ఆధారంగా చేసుకుని దేశ వ్యాప్తంగా రుసుమును పెంచారు.

– సొకుంట్ల వెంకటేశ్, దిలావర్‌పూర్ టోల్ ప్లాజా మేనేజర్

దూరభారం తగ్గించేందుకే వంతెన నిర్మాణం

- రాష్ట్ర దేవాదాయ, అటవీ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

సారంగపూర్(నిర్మల్): జిల్లా ప్రజలకు దూరభారం తగ్గించేందుకే స్వర్ణనదిపై వంతెన నిర్మాణం చేపడుతున్నామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాంసింగ్ తండాలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం బీరవెల్లి బీరవెల్లి–జామ్ గ్రామాల మధ్య స్వర్ణ నదిపై రూ.3.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో చేపట్టిన అభివృద్ధిని చూసే ప్రతి రాష్ట్రంలోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజాదరణ లభిస్తోందన్నారు. మహారాష్ట్ర వాసులు స్వచ్ఛందంగా వచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు. తమ రాష్ట్రాన్ని కూడా తెలంగాణలా అభివృద్ధి చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలకు దిగుతున్నారన్నారు. ఈరెండు పార్టీల నాయకులకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రైతు సమయ్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కౌట్ల(బి)ఆలూరు పీఏసీఎస్ అధ్యక్షులు అయిర నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, నాయకులు రాంకిషన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, పీఆర్ డీఈఈ తుక్కారాం, తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా అభ్యంతరాలే..



కలెక్టరేట్ వద్ద రాంపూర్, మైసంపేట్ వాసులు

- ఇళ్ల నిర్మాణాలు సక్రమంగా లేవని ఆరోపణలు
- బడ్జెట్ మేరకే పనులు చేస్తున్నామంటున్న అధికారులు

కడెం(ఖానాపూర్): పులి ఆవాసం కోసం కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని రాంపూర్, మైసంపేట్ గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్‌గా తరలించనున్నారు. ఆయా గ్రామస్తులకు కడెం మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో గల అటవీ భూమిలో పునరావాస కాలనీ ఏర్పాటు చేస్తుండగా అడుగడుగునా అభ్యంతరాలే వ్యక్తం అవుతున్నాయి. గతంలో తమకు చెప్పిన విధంగా కాకుండా అధికారులు ఇష్టారీతిన పనులు చేస్తున్నారని ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగని అభ్యంతరాలు

రాంపూర్, మైసంపేట్ వాసులు గ్రామాలను ఖాళీ చేస్తే పునరావాసం కింద సకల సౌకర్యాలతో ఇళ్లు నిర్మిస్తామని అటవీశాఖ అధికారులు హామీ ఇచ్చారు. అయితే ఇళ్లను తక్కువసైజులో నిర్మిస్తున్నారని, అలా కాకుండా 25:30 సైజులో నిర్మించాలని, స్లాబ్ పొడవు పెంచడం లేదని ఇటీవలే అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.



పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

బడ్జెట్ మేరకే పనులు

బడ్జెట్‌లో మొత్తం 94 కుటుంబాలకు(యూనిట్లు) రూ.15 లక్షల చొప్పున కేటాయించారని, దాని ప్రకారమే పనులు చేస్తున్నామని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతున్నాయని, మిగతా డబ్బులతో రోడ్లు, పాఠశాలలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈవిషయమై పంచాయతీరాజ్ అధికారులను వివరణ కోరగా అటవీ అధికారుల సూచనల మేరకే పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

పగుళ్లు తేలుతున్నయ్



ఇటీవలే వేసిన ఇళ్ల స్లాబ్‌లు పగుళ్లు తేలుతున్నాయి. క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదు. పిల్లర్లు సరిగా లేవు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ముందుగా చెప్పిన మాదిరి కాకుండా బడ్జెట్ లేదని పనులు తగ్గిస్తున్నారు. ఇలా అయితే మేం గ్రామాలను ఖాళీ చేయం.

– అమృత్‌రావు, మైసంపేట్

పనులు పర్యవేక్షిస్తున్నాం



పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలు నిత్యం పరిశీలిస్తున్నాం. గ్రామస్తులు ఆరోపిస్తున్నట్లు అవి పగుళ్లు కావు. సిమెంట్ ఒకచోటకు చేరడం వల్ల ఎయిర్ క్రాక్స్ ఏర్పడుతాయి, వాటితో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. స్లాబ్‌లకు మళ్లీ ఫ్లోరింగ్ చేస్తారు.

– లవకుమార్ పీఆర్, ఏఈ

బడ్జెట్ మేరకే పనులు



రాంపూర్, మైసంపేట్ గ్రామాల పునరావాస కాలనీలో బడ్జెట్ మేరకే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నాం. ఇంటి నిర్మాణానికే రూ.10 లక్షలు ఖర్చవుతున్నాయి. మిగతా డబ్బులతో రోడ్లు, పాఠశాల, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది.

– కోటేశ్వరావు, ఎఫ్‌డీవో, ఖానాపూర్

పట్టణాల్లో 'ఉపాధి' అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కూలీలు

ఖానాపూర్: పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కూలీ బిడ్డల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేదరి దేవరాం మాట్లాడుతూ గతంలో పంచాయతీలుగా ఉన్న మున్సిపాలిటీలను ప్రభుత్వం పట్టణాలుగా మార్చడంతో ఉపాధిహామీ పథకం రద్దయిందన్నారు. దీంతో ఇప్పటివరకు ఉపాధి పనులపై ఆధారపడ్డ కూలీలంతా ఇతర జిల్లాలు, మండలాలకు పనుల కోసం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. యాంత్రీకరణ పెరగడం వల్ల వ్యవసాయ పనులు సైతం దొరకడం లేదన్నారు. కేరళ, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల్లో మాదిరి తెలంగాణలో కూడా ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచర్ల రవికిరణ్, రాష్ట్ర సహాయకార్యదర్శి భానుచందర్, కూలీలు లక్ష్మి, గంగవ్వ, స్వప్న, వెంకవ్వ, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 5, 11, 14 తేదీల్లో బాబూ జగ్జీవన్‌రాయ్, మహాత్మా జ్యోతిబాపూలే, అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లపై సోమవారం కలెక్టర్‌లో సంబంధిత అధికారులు, సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబూ జాగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలన్నారు. అంబేద్కర్ భవన్‌లో సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వర్‌గౌడ్, ముడుపు సత్యనారాయణ, బొడ్డు లక్ష్మణ్, రాములు, బరుకుంట గంగాధర్, రాజేశ్వర్, ఎన్జీవో అధ్యక్షుడు ప్రభాకర్, సంఘ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

నిర్మల్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 9,085 మంది విద్యార్థులకు గానూ 9,077 మంది హాజరుకాగా ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 9,077 మందికిగానూ 9,071 మంది హాజరుకాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. 8 మంది ప్రైవేట్ విద్యార్థులకుగానూ ఆరుగురు హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్, జుమ్మెరాత్‌పేట్ పాఠశాల, కస్బా ఉన్నత పాఠశాల, సోన్ ఉన్నత పాఠశాల, లెఫ్ట్‌పోచంపాడు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లను అనుమతించవద్దన్నారు. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రముఖ్ రాజేశ్‌సింగ్

కడెం(ఖానాపూర్): నేటి యువత ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ధర్మజాగరణ్ జిల్లా ప్రముఖ్ రాజేశ్‌సింగ్ అన్నారు. సోమవారం మండలంలోని పాండ్వపూర్ హనుమాన్ ఆలయం వద్ద నుంచి పెద్దూర్ హనుమాన్ ఆలయం వరకు వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కడెం, ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల నుంచి హనుమాన్ భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. కడెం, పెంబి, దస్తురాబాద్ ఎస్సైలు రాజు, రజనీకాంత్, ప్రభాకర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో శోభాయాత్ర నిర్వాహకులు రవీందర్‌గౌడ్, హరిప్రీత్‌సింగ్, రవీందర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక

- గౌరీశంకర్ ఫంక్షన్‌హాల్‌లో లక్కీడ్రా

భైంసాటౌన్(ముధోల్): పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం లక్కీడ్రా నిర్వహించనున్నట్లు ఆర్డీవో రవికుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిర్మల్‌రోడ్‌లోని గౌరీశంకర్(న్యూ ఎస్‌ఆర్‌ఆర్) ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మొత్తం 1,030 మంది లబ్ధిదారులను గుర్తించి తుదిజాబితా రూపొందించామన్నారు. పట్టణంలో 640 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా గుండెగాం వాసులకు తాత్కాలిక ఆశ్రయం కల్పించిన నేపథ్యంలో ప్రస్తుతం 440 ఇళ్లకు మాత్రమే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరో 200 ఇళ్లకు మూడు, నాలుగు నెలల తర్వాత ఎంపిక చేస్తామన్నారు. పట్టణంలో కొత్తగా 180 ఇళ్లు మంజూరయ్యాయని, మరో 380 ఇళ్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అర్హులైనవారికి రిజర్వేషన్ ప్రకారం ఇళ్లు కేటాయిస్తామన్నారు.

కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలి

లక్కీడ్రా కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో కోరారు. ఆయా వార్డుల పరిధిలోని లబ్ధిదారులు హాజరయ్యేలా చూడాలన్నారు.

పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి

- విజయ డెయిరీ అధికారి మధుసూదన్

నర్సాపూర్(జి): రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని విజయ డెయిరీ జిల్లా అధికారి మధుసూదన్ అన్నారు. మండలంలోని టెంబరేణిలో సోమవారం పాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఏప్రిల్ నుంచి లీటర్ పాలకు రూ.5 అదనంగా పెంచినట్లు తెలిపారు. పాడి పరిశ్రమ కొరకు స్త్రీ నిధి, ఎస్‌బీఐ అందిస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట అధికారులు దస్రూ నాయక్, సంతోష్, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును సోమవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మర్యాదపూర్వకరంగా కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలను విన్నవించారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలుగా మార్చాలని, అదేవిధంగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు.

రేపు అడెల్లి ఆలయంలో బహిరంగ వేలం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు అమ్మవారికి సమర్పించే ఒడి బియ్యం పోగు చేసుకునేందుకు బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని ఈవో రవికిషన్ తెలిపారు. ఈ వేలానికి గంట ముందు వ్యాపారులు దరావత్తు సొమ్ము చెల్లించి పాల్గొనాలని ఆయన సూచించారు.

మిస్సింగ్ కేసు


గంగాధర్ (ఫైల్)

తానూరు: మండలంలోని మహలింగి గ్రామానికి చెందిన కార్పె గంగాధర్ (32) కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. గంగాధర్ ఆర్‌ఎంపీ వైద్యుడిగా గ్రామంలో పనిచేసేవాడు. ఈ నెల 1న పని నిమిత్తం భైంసాకు వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గంగాధర్ తండ్రి పిరాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీకేసులో ఒకరి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్:ఆదిలాబాద్‌లో ఇటీవల ఇందిరానగర్‌కు చెందిన వ్యక్తి సెల్‌ఫోన్‌ను దొంగలించిన కేసులో సోమవారం మరొకరిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. రెండురోజుల క్రితం ఇద్దరిని అరెస్ట్ చేయగా వీరిలో ఒకరు మైనర్ బాలుడు ఉన్నారు. వీరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ చోరీ

ముథోల్: మండలంలోని తరోడ గ్రామానికి చెందిన బూసి ఓమేశ్వర్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను దొంగలించారని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

తల్లిదండ్రులకూ పరీక్షే..!


ప్రాథమిక పాఠశాల వద్ద వంటలు సిద్ధం చేస్తున్న తల్లిదండ్రులు

- టెన్త్ విద్యార్థులకు తోడుగా తల్లిదండ్రులు
- కరంజి(టి) విద్యార్థులకు అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రం
- 25 కి.మీ దూరంతో ఆందోళన
- రోడ్డు, రవాణా సౌకర్యం అంతంత మాత్రమే
- అందర్‌బంద్‌కు పిల్లలతో తల్లిదండ్రుల బస
- వారానికి సరిపడా కిరాణా సామగ్రి కొనుగోలు

తాంసి: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని భీంపూర్, అర్లి(టి), కరంజి(టి), అందర్‌బంద్ పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాశారు. కరంజి(టి) నుంచి పరీక్ష కేంద్రానికి సుమారు 25 కి.మీ దూరం ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు గంటకు పైగా ప్రయాణం, దీనికి తోడు అంతరాష్ట్ర రహదారిపై పూర్తిగా గుంతలమయంగా ఉంది. సరైన రవాణా సౌకర్యం లేదు. సకాలంలో చేరుకునే అవకాశం లేకపోవడంతో పిల్లల వెంట తల్లిదండ్రులు అందర్‌బంద్‌కు పయనమయ్యారు. వారానికి సరిపడా కిరాణా సామగ్రిని, ఇతర వస్తువులను కొనుగోలు చేసుకుని అక్కడికి వెళ్లారు.

జీపీ భవనం, ప్రాథమిక పాఠశాలలో బస..

కరంజి(టి) పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి నిత్యావసర సామగ్రితో అందర్‌బంద్‌కు వచ్చారు. పరీక్షలు ముగిసే వరకు పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాలలో వారు ఉండనున్నారు. వారి సౌకర్యార్థం పంచాయతీ భవనంలో సర్పంచ్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులు ఉదయం పరీక్ష రాస్తుండడం, వారికి సమయానికి వంట సిద్ధం చేసి పెడుతున్నారు తల్లిదండ్రులు. వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతిఏటా పది పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. ఇప్పటికైనా అందర్‌బంద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే వచ్చే సంవత్సరం అర్లి(టి)లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

పరీక్ష కేంద్రం మార్చాలి



కరంజి(టి) గ్రామానికి పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో రావడానికి ఇబ్బంది పడుతున్నాం. గ్రామానికి కనీసం బస్సు సౌకర్యం సరిగ్గా లేదు. తల్లిదండ్రులు తమను తీసుకొచ్చి అక్కడే ఉంచి పరీక్ష రాయిస్తున్నారు. వచ్చే సంవత్సరం పరీక్ష కేంద్రం మార్చాలి.

– డి.అమూల్య, విద్యార్థిని కరంజి(టి)

పరీక్ష కేంద్రం దూరంతో ఇబ్బంది



కరంజి(టి) నుంచి అందర్‌బంద్ పరీక్ష కేంద్రం దూరంగా ఉంది. కేంద్రం రావడానికి సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేదు. కేంద్రానికి సకాలంలో చేరుకునే పరిస్థితి లేదు. వారం పాటు ఇక్కడే ఉండి పరీక్షలు రాయాలని తల్లిదండ్రులతో కలిసి వచ్చి ఇక్కడే ఉంటున్నాం.

– అలాలి చరణ్, విద్యార్థి, కరంజి(టి)

ఇక్కడే ఉంటున్నాం..



పది పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని వారితో కలిసి అందర్‌బంద్‌లో ఉంటున్నాం. ఇక్కడ ఉండి వారికి భోజనం, ఇతర అవసరాలను దగ్గరుండి చూస్తున్నాం. ప్రతి ఏటా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదు. పరీక్ష కేంద్రం మార్చాలి లేకపోతే విద్యార్థుల పరీక్షల సమయంలో అధికారులు వసతులు కల్పించాలి.

– అలాలి రమేశ్, విద్యార్థి తండ్రి, కరంజి(టి)


అందర్‌బంద్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు


అందర్‌బంద్ పంచాయతీ భవనంలో చదువుతున్న విద్యార్థులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం





గుడిహత్నూర్: మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహిస్తున్న సప్తాహం ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం ప్రారంభమైన రథోత్సవం ప్రధాన వీధుల గుండా సాగింది. హనుమాన్ దీక్షాపరులు రథాన్ని లాగారు. ఈ శోభాయాత్రలో మహిళలు, యువతీ, యువకులు డీజే పాటలకు నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ పటేల్ వామన్ గిత్తే దంపతులు పెళ్లి పెద్దగా వ్యవహరిస్తూ కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, బీజేపీ రాష్ట్ర మహిళా సభ్యురాలు సుహాసిని రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొన్నారు.



కల్యాణం కమనీయం



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానం 66వ వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం కమనీయంగా జరిగింది. పండితులు వేదమంత్రోచ్చరణ మధ్య కల్యాణ తంతు జరిపించారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.నవీన్‌కుమార్, కార్యనిర్వాహణ అధికారి ఆర్.రవికిషన్, ఆలయ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను వాహనాల్లో తరలించాలని ఐటీడీఏ ఉన్నతాధికారులు ఆదేశించారు. వాటికి సంబంధించి రవాణా చార్జీలను సైతం అందజేస్తున్నారు. దీంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేట్ వాహనాలను సమకూర్చుకున్నారు. ఇదిలా ఉండగా వాన్‌వాట్ ఆశ్రమ పాఠశాలలో 34 మంది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. వీరిని పరీక్ష కేంద్రానికి తరలించేందుకు ఒక్కటే ఆటోను ఏర్పాటు చేసి రెండు ట్రిప్పుల చొప్పున తరలించారు. ఒక్కొక్క ట్రిప్పునకు 17 మంది చొప్పున తరలించారు. ఆటో లోపల కూర్చోవడానికి స్థలం లేక వేలాడుతూ ఎండలో ప్రమాదం అంచున విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని 'సాక్షి' సంప్రదించగా మంగళవారం నుంచి ట్రిప్పుల సంఖ్య పెంచుతామని తెలిపారు.


నిర్మల్‌లో హాల్‌టికెట్ నంబర్ చూస్తూ..


చింతలమానెపల్లిలో..


దండేపల్లి: లింగాపూర్‌లో స్క్రైబ్ సాయంతో పరీక్షకు అంధ విద్యార్థి


కెరమెరిలో..


దహెగాంలో..


దండేపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


నార్నూర్ లో పరీక్ష రాస్తున్న అంధ విద్యార్థి అనిల్


తాంసి: కప్పర్ల పాఠశాలలో నానమ్మ గంగుబాయితో విద్యార్థి సిద్ధార్థ్

'పది'లంగా పరీక్షకు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. విద్యార్థులు ఉదయం 9గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకుని వారివారి హాల్‌టికెట్ నంబర్లు చూసుకోవడంలో బిజీగా మారారు. గ్రామాల నుంచి పరీక్ష కేంద్రానికి వచ్చేందుకు పలువురు విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అలాగే ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు సైతం వాహనాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పరీక్ష కేంద్రానికి తరలివచ్చారు. అయితే కడెం మండలంలో విద్యార్థి రోహిత్ తండ్రి ఆదివారం రాత్రి మృతిచెందగా పుట్టెడు దుఃఖంతో పరీక్షకు హాజరు కాగా పలువురు దివ్యాంగ విద్యార్థులు సైతం పది పరీక్షలు రాశారు.


కడెం: తండ్రి మరణించిన పరీక్ష రాసేందుకు వచ్చిన తక్కల్ల రోహిత్


నెన్నెల: అంజనేయుడికి మొక్కుతున్న విద్యార్థినులు


కాసిపేట: మోడల్ స్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్ చూస్తూ..


నిర్మల్‌లోని బాలికల ఉన్నత పాఠశాల గేటు వద్ద..

ఆటో బోల్తా

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

జైనథ్: మండలంలోని పూసాయి గ్రామ సమీపంలో 44 నెంబర్ జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..మహారాష్ట్రలోని ఘటంజి తాలూకా దేవుదరి గ్రామానికి చెందిన గౌతమ్ (40) గత రెండేళ్లుగా తన భార్య పిల్లలతో కలిసి ఆదిలాబాద్‌లోని రిక్షా కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం తన భార్య, ఇద్దరు పిల్లలు, బంధువులతో కలిసి తన స్వగ్రామమైన దేవుదరికి ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో పూసాయి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గౌతమ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతుడి సోదరుడు గజానంద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న రాజేష్

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామ 61వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కిందపడటంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కుంటాల గ్రామానికి చెందిన యువకుడు సిర్ల రాజేష్ తన మిత్రుడు నదీమ్‌తో కలిసి బైక్‌పై నిర్మల్ వెళ్లారు. అక్కడ పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో రాజేష్ తలకు తీవ్రగాయమైంది. మిత్రుడు నదీమ్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని నిజామాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

భూవివాదంలో ఇరువర్గాల దాడి

ఇచ్చోడ: మండలంలోని తలమద్రి గ్రామంలో సోమవారం భూ వివాదంలో ఇరువర్గాల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తలమద్రి గ్రామంలో గసకంటి రాజన్న, గణేశ్‌కు చెందిన వ్యవసాయ భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన మునేశ్వర్ కోటేశ్వర్, పాముల గణేశ్, చిరంజీవిలు ఆ భూమిలో దున్నడానికి ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల దాడిలో తీవ్రగాయాలైన రాజన్న, గణేశ్‌లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.